ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

బుధవారం 16 ఏప్రిల్ 2025

న్యూస్ బాక్స్

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి



గోదావరిఖని, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో ముఖ్యమంత్రిని కలిసి 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు పనులను త్వరగా చేపట్టాలని, నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సీఎల్‌పీ సమావేశంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పాల్గొన్నారు.

టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ ట్రైనింగ్ కోర్సు కోసం ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవా లని జిల్లా విద్యా శాఖ అధికారి డి మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1వ తేదీ నుంచి టెక్నికల్ టీచర్ సర్టిఫి కెట్ 42 రోజుల సమ్మర్ ట్రైనింగ్ కోర్స్ శిక్షణ పొందేందుకు ఈనెల 17 నాటికి 18-45 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు, సెకండరీ స్కూల్ సర్టిఫికెట్, లోయర్ గ్రేడ్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్య ర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను, అడ్మి షన్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఈ నెల 29లోగా ఆయా దరఖాస్తులను ఉమ్మడి జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయం కరీంనగర్‌లో అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన

8

మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- అదనపు కలెక్టర్ డి.వేణు

- కేంద్రాల్లో కుప్పలు కుప్పలుగా ధాన్యం
- కాగితాల్లోనే కేంద్రాల ఆరంభం
- తేమ శాతం రావడం లేదనే సాకు
- వాతావరణంలో మార్పులతో ఆందోళన చెందుతున్న రైతులు

కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు



బసంత్‌నగర్ ఎయిర్ పోర్టులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం

యాసంగి సీజన్‌లో పండించిన వరి పంట కోతలు ఆరంభమై పదిహేను రోజులు గడుస్తున్నాయి. ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించ లేదు. జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ప్రారం భించామని అధికారులు పేర్కొంటున్నారు. కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేశారు గానీ ఇప్పటి వరకు ధాన్యం తూకం వేయడం లేదని రైతులు చెబుతున్నారు. ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉందనే సాకులు చూపుతూ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు.

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ధాన్యం తూకం వేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో లక్షా 96 వేల ఎకరాల్లో వరి సాగు కాగా, తద్వారా 4 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తా యని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖాధికారులు అం చనా వేశారు. ఇతర అవసరాలకు పోనూ కేంద్రాలకు కనీసం 3 లక్షల 50 వేల టన్నుల ధాన్యం రానున్నదని పౌరసరఫరాల శాఖాధికారులు పేర్కొన్నారు. కానీ 4 లక్షల టన్నుల వరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. యాసంగి సీజన్‌లో పండించిన పంటను రైతులు కేవలం విత్తన కంపెనీ లకు మాత్రమే ధాన్యాన్ని విక్రయిస్తారు. ధాన్యం నూక అయ్యే అవకాశాలు ఉండడంతో ఈ ధాన్యాన్ని ఇంటి అవసరాలకు సద్వినియోగం చేసుకోరు. సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ప్రభు త్వం ప్రకటించడంతో ఈ సీజన్‌లో కూడా రైతులు 30 శాతానికి పైగా సన్నాలు సాగు చేశారు. జిల్లాలో వరి కోతలు ఊపందుకున్నాయి. కానీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.



పాలకుర్తి మండలం బసంత్ నగర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని నేర్పుతున్న రైతులు

● 15 రోజుల నుంచి కోతలు ఆరంభం..

జిల్లాలో పదిహేను రోజుల నుంచి వరి కోతలు మొదలయ్యాయి. వానాకాలం పంట కంటే యాసంగి సీజన్‌లో కోతలు వేగంగా జరుగుతాయి. పొలాల్లో బురద ఉండనందున కోతలు త్వరగా పూర్తవుతాయి. చాలా మంది రైతులు పంటను కోసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో రాశులు పోశారు. రోజు ఉదయం, మధ్యాహ్నం వేళలో ధాన్యాన్ని ఆరబోసి నేర్పుతున్నారు. నిబంధనల ప్రకారం ధాన్యంలో 17 శాతానికి మించి తేమ లేకుంటే మద్దతు ధర ఏ గ్రేడ్ ధాన్యానికి 2,330 రూపాయలు, కామన్ గ్రేడ్ రకం ధాన్యానికి 2,310 రూపాయలు ధర చెల్లించాల్సి ఉంటుంది. సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు అదనంగా 500 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 302 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో ప్రాథమిక వ్యవ సాయ

(మిగతా 8వ పేజీలో)

కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవుల కోసం కొట్లాట

సుల్తానాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ఉంటుందో ఊడుతుందో తెలియని పరిస్థితిలో ఉందని, ఆ పార్టీలో మంత్రి పదవుల కోసం కొట్లాడుకుంటున్నారని కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ నిజామాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. తెలంగాణాలో రాబోయేదీ బీజేపీ ప్రభుత్వమేనని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలుపొందిన అనంతరం సుల్తానాబాద్‌లో మంగళవారం వారికి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీలో పలు జిల్లాలలో కుర్చీల కోసం కొట్లాడుకుంటున్నారని, ఈ ప్రభుత్వం ఎప్పుడు పోతుందో తెలువదని, మళ్ళీ అధికారంలోకి వస్తుందో రాదో... ప్రభుత్వం ఉన్నపుడు అధికారం అనుభవించాలనే తపనతో ఎమ్మెల్యేలు మంత్రి పదవి కోసం పోటీ పడుతున్నారన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో ప్రభుత్వ వైఖరిని ఖండించారు. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతుందన్నారు. స్థానిక ఎన్నికలలో గెలుపు కోసం ప్రయత్నించాలని తాము అండగా ఉంటామని, ఏ సమస్య ఉన్నా కాల్ చేస్తే స్పందిస్తామన్నారు.



ఎమ్మెల్సీలను సన్మానిస్తున్న నాయకులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికలలో తెలంగాణాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. స్థానిక ఎన్నికలలో నాయకులు పోటీ చేసేందుకు ఆసక్తి చూపాలని, కష్టపడి పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు, దేశంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో అవినీతి రహిత పాలన సాగుతుందన్నారు. దేశంలో పదేళ్ల బీజేపీ ప్రభుత్వంలో ఎలాంటి అవినీతి అక్రమాలు కుంభకోణాలు లేకుండా మోదీ పాలన సాగిందన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు గుజ్జుల రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతు పార్టీ సిద్ధాంతం ఆశయంగా కార్యకర్తలు నాయకులు పని చేస్తున్నారని, బీజేపీలో చేరడానికి ఎంతోమంది ఆసక్తి చూపుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, గోమాస శ్రీనివాస్, గొట్టిము క్కుల సురేష్‌రెడ్డి, కందుల సంధ్యారాణి, మీస అర్జున్ రావు, చల్లా నారాయణ రెడ్డి, శంకర్, గుర్రాల మల్లేశం, కడారి అశోక్ రావు, ఎస్ఎన్‌సీ వనజ, మిట్టపల్లి ప్రవీణ్, నాగరాజు, కందుల శ్రీనివాస్, మహేందర్ జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు ఐబీ చౌరస్తా నుంచి సభా వేదిక వరకు ర్యాలీ నిర్వహించారు.

సుల్తానాబాద్‌లో మూడు ప్రధాన రోడ్లకు మహర్దశ

వేగంగా కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో మూడు ప్రధాన రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. పట్టణంలో రద్దీగా ఉండే ఐబీ చౌరస్తా నుంచి ప్రభుత్వ కార్యాలయాల మీదుగా నీరుకుళ్ల రోడ్డు, గట్టెపల్లి రోడ్డు చౌరస్తాల వరకు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఐబీ చౌరస్తా వద్ద ఒక ప్రధాన కూడలిని ఏర్పాటు చేయను న్నారు. ఈ మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల కు చెందిన మూల మలుపు వద్ద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ గదులు కూడా తొల గించేందుకు నిర్ణయించారు. ఎమ్మెల్యే విజయ రమణారావతో పాటు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ, పలువురు ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించారు. ఆర్‌అండ్‌బీకి చెం దిన షాపింగ్ కాంప్లెక్స్ గదులు కూడా తొలగించాలని నిర్ణయించారు. ప్రభుత్వ హైస్కూల్ స్థలం, ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన షాపింగ్ కాంప్లెక్స్ గదులు తొలగించాలని నిర్ణయించారు. ఈ రోడ్డుపై మూడు చౌరస్తాలు కూడలిగా తీర్చిదిద్దాలని ప్రతిపాదించారు. ఈ రోడ్డు పనులు ప్రస్తుతం వేగవంతంగా కొనసాగుతున్నాయి. మరో వైపు డివైడర్ల ఏర్పాటు వంటి వాటి సర్వే పనులు జరుగుతున్నాయి.

● పాత జెండా టూ మున్సిపల్ ఆఫీసు

పాత జెండా నుంచి మున్సిపల్ ఆఫీసు వరకు బీటీ రోడ్డును నిర్మించనున్నారు. గతంలో ఉన్న రోడ్డు చిన్నగా ఉండడం వలన పెద్ద వాహనాలు రావడం పోవడం ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం ఈ రోడ్డు పనులు విస్తరించడంతో పాటు కొత్త రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. పాత రోడ్డు తొలగింపు, ఇరుపక్కల తవ్వకాల పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి.

● పూసాల రోడ్డు విస్తరణ పనులు షురూ

సుల్తానాబాద్ రాజీవ్ రహదారి నుంచి పూసాల రోడ్డు విస్తరణ పనులు కూడా ఆదివారం ప్రారంభమయ్యాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం పూసాల వరకు కాకుండా వివేకానంద స్కూల్ వరకు నిర్మించింది. మిగిలిన రోడ్డు పనులతో పాటు డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టనున్నారు. సుల్తానాబాద్ పట్టణంలో మూడు ప్రధాన రోడ్లకు మహర్దశ పట్టనుంది.



పాత జెండా నుంచి మున్సిపల్ ఆఫీసు రోడ్డు పనులు ప్రారంభం



పూసాల రోడ్డు విస్తరణ పనులు



ఐబీ చౌరస్తా నుంచి డబుల్ రోడ్డు పనులు

చికెన్ వ్యర్థాల సేకరణకు ఈవోఐ

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కోల్‌సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో చికెన్ వ్యర్థాల సేకరణకు ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈఓఐ)ను పిలిచారు. ఈ మేరకు రామగుండం నగరపాలక సంస్థ టెండర్ నోటీసు ఇచ్చింది. కార్పొరేషన్ పరిధిలో చికెన్ వ్యర్థాలతో కాసుల పంట శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై యంత్రాంగం స్పందించింది. వ్యర్థాల సేకరణకు సంబంధించి ఆసక్తి గల వారి నుంచి ఏజెన్సీలు రేటు కోడ్ చేసేలా ఈఓఐ పిలిచారు. ఇప్పటి వరకు కార్పొరేషన్‌కు యేటా రూ.90వేలు మాత్రమే చెల్లించి వ్యర్థాలను తీసుకెళుతున్నారు. కాంట్రాక్టర్లు వ్యర్థాలు తీసుకెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. తద్వారా కార్పొరేషన్ ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. రామగుండం నగరపాలక సంస్థ చికెన్ వ్యర్థాల సేకరణకు సంబంధించిన ఈ నెల 19లోగా ఈఓఐ తుది గడువుగా నిర్ణయించారు.

స్ట్రెచర్‌పైన.. ఎక్స్‌రే పరికరాలు



ఆసుపత్రిలో స్ట్రెచర్‌పై పెట్టిన ఎక్స్‌రే యంత్రాలు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రోగులను తరలించాల్సిన స్ట్రెచర్‌పై ఎక్స్‌రే మిషన్‌ను పెట్టి చేతులు దులుపుకున్నారు గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సిబ్బంది. నాలుగు రోజుల క్రితం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఎక్స్‌రేకు సంబంధించిన యంత్రాలు వచ్చాయి. వాటిని నిర్లక్ష్యంగా స్ట్రెచర్‌పై పెట్టి వదిలేశారు. లక్షల విలువ చేసే యంత్రాలను వరండాల్లో, స్ట్రక్చర్‌పై వదిలేయడంపై రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నీరుకుళ్ల రంగనాయక స్వామి ఆలయంలో

వైభవంగా శకటోత్సవం

రేపు రథోత్సవం 7లో

'భూ భారతి' చట్టంపై విస్తృత ప్రచారం కల్పించాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి ఆర్వోఆర్ చట్టంపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో భూ భారతి చట్టం అమలుపై అదనపు కలెక్టర్ డి వేణు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టంపై తహసీల్దార్లు, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టంలో రెండంచెల అప్పీల్ వ్యవస్థ ఉందన్నారు. ఇకపై రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ చేసే సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి అవుతుందన్నారు. ఈనెల 17 నుంచి 30 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, దీనికి సంబంధించిన షెడ్యూల్ తయారు చేసుకోవాలన్నారు. రోజు కనీసం రెండు చోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూముల ఫెన్సింగ్, మార్కింగ్ ప్రక్రియను తహసీల్దార్‌లు పూర్తి చేయాల న్నారు. పెద్దపల్లి, మంథని ఆర్‌డీఓలు బి.గంగయ్య, సురేష్, తహసీల్దార్‌లు, పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు

పెద్దపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ఎక్కడ తాగునీటి కొరత రాకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడవద్దని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ ఇంటికి తాగునీటి సరఫరా తప్పనిసరిగా ఉండాలని, అవసరమైన చోట తాత్కాలిక పనులు చేపట్టుటకు ప్రతిపాదనలు సమర్పిస్తే నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈఈ మిషన్ భగీరథ గ్రిడ్ పూర్ణచందర్ రావు, ఇంట్రా ఈఈ గంగాధర శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు చేయాలి



అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేకంగా ఉన్న 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం అన్ని కార్మిక సంఘాల జిల్లా సదస్సు నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యం రావు, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కడారి సునీల్, ఐఎన్‌టీయుసీ బూమల్ల చందర్, ఐఎఫ్‌టీయు నాయకులు కె. విశ్వనాథ్, సిహెచ్ శంకర్, వైకుంఠం మాట్లాడారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నట్లు ఆరోపించారు. కార్మికవర్గం సమరశీల పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందని మండిపడ్డారు. వీటికి వ్యతిరేకంగా ఐదేళ్ళుగా కార్మికవర్గం చేస్తున్న ఆందోళన, పోరాటాలతో లేబర్ కోడ్‌ల అమలు 5 ఏళ్ల ఆలస్యమైనా, ఇప్పుడు వాటిని అమలు చేసి కార్మిక హక్కులను హరించే ప్రయత్నం చేస్తోందన్నారు. 2025-26 బడ్జెట్‌లో కార్పొరేట్ అనుకూల విధానాలకు అనుగుణంగా కేటాయింపులు చేసిందని, సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టిందని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకోనేందుకు కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించాయని తెలిపారు. సార్వత్రిక సమ్మెకు సంయుక్త కిసాన్‌మోర్చా మద్దతు ప్రకటించిందన్నారు. రాష్ట్ర కార్మికవర్గం సమ్మెకు సమాయత్తం కావాలని, సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు, ప్రభుత్వరంగ సంస్థల కార్మికులు, ఉద్యోగులు సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సేపెల్లి రవీందర్, పూసాల రమేష్, జె. సమ్మిరెడ్డి, భీమయ్య, అశోక్, నరేష్, ఆనంద్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కోల్‌సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తన వద్ద ఉండకుండా కూతురు అల్లుడి వద్దకు వెళుతుందనే మనస్తాపంతో గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన ఎండీ సాజిదా(42) మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సాజిదా భర్త గౌస్ ఖాన్‌తో విభేదాలతో తల్లి మలాన్‌బీ వద్ద ఉంటూ కూలి చేసుకుంటూ జీవిస్తోంది. ఆమె కూతురు సానియాకు వివాహం అయింది. రంజాన్ పండుగకు కూతురు సానియా గోదావరిఖనిలోని తల్లివద్దకు వచ్చింది. తిరిగి భర్త వద్దకు వెళ్లేందుకు సిద్ధం అవుతుండగా తల్లి సాజిదా అడ్డుకుంది. తన వద్దే ఉండాలని అల్లుడి వద్దకు వెళ్లవద్దంటూ గొడవ చేసింది. మంగళవారం సానియా అత్తగారింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సాజిదా తల్లి మలాన్‌బీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ట్రాలీని ఢీకొన్న లారీ

-ఒకరికి తీవ్ర గాయాలు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం ధరూర్ శివారులోని వైన్స్ సమీపంలో ట్రాలీని లారీ ఢీకొనడంతో ట్రాలీ నడుపుతున్న కరీంనగర్‌కు చెందిన నవీన్‌కు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. నవీన్ ట్రాలీ నడుపుకుంటూ కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టి వెళ్లింది.

స్వగ్రామం చేరిన వలసజీవి మృతదేహం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సక్కపేట గ్రామానికి ముత్యం వెంకటేశం గౌడ్(50) అనే వలస జీవి మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. సౌదీ అరేబియాలో గతనెల 13న వెంకటేశం గౌడ్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం గ్రామానికి చేరుకోగా కుటుంబీకుల, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య పద్మ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

కొడిమ్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం ఆరెపల్లి గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని తుమ్మ నాగరాజు(21) అనే యువకుడు మృతిచెందాడు. ద్విచక్ర వాహనంపై జగిత్యాల నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న చెర్లబూత్కూర్‌కు చెందిన నాగరాజును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న శేఖర్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి.

మహిళను దూషించిన వ్యక్తిపై కేసు

మల్యాల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రామన్నపేటకు చెందిన శ్రీరాముల రమేశ్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన తునికి మాధవి అలియాస్ రాజేశ్వరి అనే మహిళను సోమవారం దూషించి, చంపుతానని బెదిరించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.



విద్యుత్‌తో జాగ్రత్త

- అకాల వర్షాలు, ఈదురుగాలులతో ప్రమాదాలు
- అప్రమత్తతే ఆయుధం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అకాల వర్షాలు, ఈదురుగాలులు ఎక్కువగా సంభవిస్తుంటాయి. దీంతో విద్యుత్ తీగలు తెగిపడడం, స్తంభాలు నేలకొరగడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటాయి. ఇలాంటి సమయంలో తడిసిన స్తంభాలు, సపోర్టింగ్ తీగలను తాకితే విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. ప్రధానంగా పొలాల వద్దకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలి. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చు. అకాల వర్షం కురుస్తున్నప్పుడు తడిసిన విద్యుత్ స్తంభాల స్టేవైరు/సపోర్టు తీగలను, స్తంభాలను, విద్యుత్ ఉపకరణాలను తాకరాదు. వేలాడుతున్న, వదులుగా ఉన్న, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను ముట్టుకోవద్దు. గమనించిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలి. ఇళ్లలో దుస్తులు ఆరవేసే జీఐ దండాల పైనుంచి విద్యుత్ వైర్లు వెళ్లడంతో విద్యుత్ వాటి ఇన్సులేషన్ దెబ్బతింటుంది. దీంతో దండాలు, పైపులకు విద్యుత్ సరఫరా అవుతుంది. ప్లాస్టిక్ దండాలు ఉపయోగిస్తే ఇలాంటి ప్రమాదాలకు దూరంగా ఉండొచ్చు. విద్యుత్ వైర్లు దండాలు, రేకులకు తగలకుండా జాగ్రత్త వహించాలి. వ్యవసాయ మోటార్లు, ఫుట్ వాల్వులు, సర్వీసు వైర్లకు విద్యుత్ ప్రసారంతో ప్రమాదాలు సంభవిస్తాయి.

ఈ సమయంలో మోటార్లను, పైపులను, ఫుట్ వాల్వులను తాకరాదు. వ్యవసాయ పంపుసెట్లు, స్టార్టర్లకు ఎర్త్ ఏర్పాటు చేయాలి. ఎర్త్ లేని మోటార్లు, స్టార్టర్లు, జీఐ పైపులు, ఫుట్‌వాల్వ్‌లు అత్యంత ప్రమాదకరం. రైతులు, వినియోగదారులు స్వయంగా విద్యుత్ పనులు చేయవద్దు. అర్హులైన ఎలక్ట్రీషియన్‌ను సంప్రదించాలి. మూగజీవాలను మేతకు తీసుకెళ్లినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల దగ్గరికి వెళ్లకుండా జాగ్రత్త వహించాలి. ఇంటి వైరింగ్‌కు ఎర్తింగ్ చేయించుకోవాలి. ఇళ్లలో నాణ్యమైన విద్యుత్ స్విచ్ బోర్డులు, ఇతర వస్తువులను ఉపయోగించాలి. వ్యవసాయ మోటార్లు, ఇళ్లల్లో అతుకులు లేని సర్వీసు వైరును ఉపయోగించాలి. సెల్ ఫోన్ చార్జింగ్ పెట్టి తడి చేతులతో తాకి మాట్లాడడం ప్రమాదకరం. సమీపంలో ఎవరైన విద్యుదాఘాతానికి గురైతే ఆ వ్యక్తిని చేతులతో తాకరాదు. విద్యుత్ ప్రవహించని వస్తువులను (కర్ర, ప్లాస్టిక్ లాంటి) వాడడం సరైన పరిష్కారం. ఇళ్లలో ఐఎస్ఐ మార్క్ ఉన్న స్విచ్ బోర్డులు, ప్లగ్‌లు ఇతర పరికరాలు వాడాలి.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

రమేష్ బాబు, ఎస్ఈ, టీజీ ఎన్‌పీడీసీఎల్

వర్షాలు, ఈదురుగాలుల సమంయలో విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదాలు సంభవిస్తాయి. ప్రధానంగా పొలాల వద్దకు వెళ్లే రైతులు మోటార్లను నేరుగా తాకరాదు. మూగజీవాలు ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లకుండా చూడాలి. ఇళ్లలో ప్లాస్టిక్ దండాలు వాడాలి. గ్రామీణ వినియోగదారులు క్షేత్రస్థాయి సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలి. విద్యుత్ అంతరాయం ఇతర సమస్యలపై టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫిర్యాదు చేయాలి.



పోలీసులకు సమాచారం అందిస్తున్నాడనే హత్య

- నిందితుల అరెస్టు
- ఆయుధాలు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం

వేములవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి వ్యాపారానికి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందిస్తూ తమపై కేసు నమోదు కావడానికి కారణమవుతున్నాడనే కోపంతో ఐదుగురు వ్యక్తులు కలిసి చెట్టిపల్లి పరశురాములు అనే వ్యక్తిని హత్య చేశారని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి తెలిపారు. ఈ నెల 13వ తేదీన వేములవాడ పట్టణంలో పరుశురాములను దారుణంగా హత్య చేసిన ఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం ఆమె వెల్లడించారు. ఈ మేరకు వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కేసులో మృతుడు చెట్టిపల్లి పరుశరాములు, నిందితులు బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్, నేదూరి రాజేష్, అడ్డగట్ల మనోజ్ కుమార్ చాలా రోజులుగా స్నేహితులు అని, ఎప్పుడూ వారు కలిసి తిరిగేవారని తెలిపారు. వీరందరిపై వివిధ పోలీస్ స్టేషన్లలో గంజాయి, హత్యతో పాటు పలు రకాల కేసులు నమోదు కావడంతో జైలుకు కూడా



మాట్లాడుతున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వెళ్లి వచ్చారని తెలిపారు. కొద్ది రోజులుగా ఐదుగురు నిందితులపై పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసులు నమోదు కావడం పోలీసులకు పరుశరాములే సమాచారం ఇస్తున్నాడనే అనుమానంతో హత్యకు కుట్ర పన్నారని, ఇందులో భాగంగా 13వ తేదీ ఆదివారం బైపాస్ రోడ్డులోని మహాలింగేశ్వర గార్డెన్ ఫంక్షన్ హాల్ వద్ద ఉన్నాడని తెలుసుకొని వెంట తెచ్చుకున్న గొడ్డళ్లు, కత్తులతో బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్ విచక్షణారహితంగా దాడి చేసి నరికి చంపారని ఆమె తెలిపారు. రాజేష్ అనే వ్యక్తి బయట ఉండి ఎవరూ లోపటికి రాకుండా గేటు వేసి కాపు కాసాడని తెలిపారు. అడ్డగట్ల మనోజ్ కుమార్ మీరందరూ జైలుకు వెళ్తే బెయిల్‌పై తీసుకురావడానికి తాను బయట ఉంటానని చెప్పి హత్యకు ప్రోత్సహించాడని తెలిపారు.

మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు వేగవంతంగా విచారించి హత్యకు పాల్పడిన నిందితులు బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్, నేదూరి రాజేష్‌లను పట్టుకొని రిమాండ్ తరలించగా మరో వ్యక్తి అడ్డగట్ల మనోజ్ పరారీలో ఉన్నాడని తెలిపారు. హత్యకు ఉపయో గించిన రెండు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు, ఆయు ధాలను స్వాధీనం చేసుకున్నామని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు రమేష్, వెంకట్రాజం సమావేశంలో పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం

- నాగంపేట యువకుడి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు



వినోద్ (ఫైల్)

గంభీరావుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంభీరావుపేట మండలం నాగంపేటకు చెందిన వినోద్(33) మృతిచెందగా, దేవేందర్ అనే మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం దేవేందర్‌ను హైదరాబాద్‌కు తరలిం చారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గంభీరావుపేట మండలం నాగంపేటకు చెందిన వినోద్ కొంతకాలంగా హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ మధ్యనే నాగంపేటకు వచ్చిన వినోద్ ముంబాయిలో వేరే పనిచూసుకున్నాడు. కామారెడ్డి నుంచి ముంబాయికి ట్రైన్‌కు వెళ్లేందుకు నాగంపేట నుంచి స్నేహితుడు దేవేందర్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. కామారెడ్డి సమీపాన ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంలో వినోద్, దేవేందర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ముందుగా కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొద్ది సేపటికే వినోద్ మృతిచెందాడు.

దేవేందర్ పరిస్థితి విషమించడంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా : ఒకరి మృతి



భూమేష్(ఫైల్)

కోరుట్ల రూరల్, (ఇబ్రహీంపట్నం) ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం రేగుంట సమీపంలో ఇసుక ట్రాక్టర్ బోల్తా పడి సోమవారం రాత్రి ట్రాక్టర్ యజమాని జక్కం భూమేష్(30) మృతి చెందాడు. ఇబ్రహీపట్నం ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి పట్టణం గాజులపేటకు చెందిన జక్కం భూమేష్, డ్రైవర్ చింతల సాయిలుతో కలిసి ట్రాక్టర్‌లో ఇసుక లోడుతో ఇబ్రహీపట్నంకు వెళ్తున్న సమయంలో రేగుంట సమీపంలో బోల్తా పడింది. భూమేష్ మృతిచెందగా సాయిలుకు తీవ్ర గాయాలయ్యాయి.

ప్రమాదవశాత్తూ ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధం



హుజూరాబాద్‌లో దగ్ధమైన ఎలక్ట్రిక్ స్కూటర్

హుజూరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం బోర్నపల్లి రోడ్ ఆహల్యనగర్‌లో మంగళవారం ప్రమాదవశాత్తూ ఎలక్ట్రికల్ స్కూటీ దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని ఇద్దరు మైనర్ బాలురు ఎలక్ట్రిక్ స్కూటీపై వెళ్తుండగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన వారు స్కూటీని అక్కడే వదిలిపెట్టి పారిపోయారు. ఈ విషయాన్ని స్థానికులు ఫైర్ సిబ్బందికి తెలపగా వారు వచ్చి మంటలను ఆర్పేశారు. కాగా అప్పటికే స్కూటీ పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు అపహరణ

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని కొండూరు కాంప్లెక్స్‌లో గుర్తు తెలియని దుండగుడు ఓ వృద్ధురాలి మెడలో నుంచి మంగళవారం పుస్తెలు తాడు అపహరించాడు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలం కనపర్తి గ్రామానికి చెందిన అల్లపురెడ్డి కమలమ్మ-కొంరారెడ్డి వృద్ధ దంపతులు మంగళవారం జమ్మికుంటలోని ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రిలో పని పూర్తి అయిన తర్వాత కూరగాయాలు కొనేందుకు కాంప్లెక్స్ మెట్ల వద్ద కూర్చున్నారు. వృద్ధ దంపతులను అనుసరిస్తున్న దండగుడు తాను ఓ గ్రామ కార్యదర్శిని అని, మీకు రూ.4వేల పెన్షన్ ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఫొటో తీసే సమయంలో మెడలో పుస్తెలు తాడు ఉండకూడదని సూచించడంతో వృద్ధురాలు పుస్తెలు తాడు తీసి ఇచ్చింది. దుండగుడు వృద్ధ దంపతులు కళ్లు కప్పి అక్కడి నుండి నెమ్మదిగా జారుకున్నాడు. బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

డీఈవో కార్యాలయ భవనం పైనుంచి పడి అటెండర్ మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం(డీఈవో) భవనం రెండో అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి అటెండర్ కమ్ వాచ్‌మన్ గడప రవీందర్ కుమార్(58) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, మృతుడి భార్య వివరాల ప్రకారం.. కట్టరాంపూర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న రవీందర్‌కుమార్ 28 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాల అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం కట్టరాంపూర్ ప్రైమరీస్కూల్ అటెండర్‌గా పనిచేస్తూ డిప్యుటేషన్‌పై కరీంనగర్ డీఈవో కార్యాలయ అటెండర్ కమ్ వాచ్‌మన్‌గా ఆరు నెలల నుంచి విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో భవనం 2వ అంతస్థుపై ఆరేసిన బట్టలు తీసుకొని కిందకు వస్తున్నాడు. ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. తల, ఛాతీ, చేయికి బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రవీందర్‌కుమార్ భార్య ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సైకిల్‌పై నుంచి పడి ఒకరి మృతి

పెగడపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రంలో మంగళవారం వడ్లూరి మల్లయ్య (59) అనే వ్యక్తి సైకిల్ పై నుంచి పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మల్లయ్య ఇంటి నుంచి సైకిల్‌పై చెరువు కట్ట వైపు వెళ్తుండగా స్పృహ తప్పి రోడ్డు పక్కన ఆపి ఉన్న ట్రాక్టర్ డబ్బాను ఢీకొట్టాడు. సైకిల్‌పై నుంచి పడడంతో తలకు రాయి తగిలి తీవ్ర రక్తస్రావమై మృతిచెందాడు. ఎండ ప్రభావం తాళలేక సైకిల్‌పై నుంచి పడి చనిపోయాడని మృతుడి కుమారుడు మధూకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వేములవాడ టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన వేములవాడ మండలం అనుపురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అనుపురం గ్రామానికి చెందిన బండారి శ్రీహరి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అనుపురం గ్రామ శివారులో వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో శ్రీహరి (48) అక్కడికక్కడే మృతి చెందాడు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

పాలకుర్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్ఐ ఆర్ స్వామి అన్నారు. మంగళవారం కన్నాల టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు తప్పని సరిగా ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, ప్రమాదకరమన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

మల్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మల్యాలకు చెందిన గడుగు తిరుపతి అనే వ్యక్తిపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గడుగు తిరుపతి మామిడి తోట కౌలుకు తీసుకొని అందులో ఉండగా అదే గ్రామానికి చెందిన బోదాసు శంకర్ మామిడి తోట నుంచి వెళ్తున్నాడు. ఎటు వెళ్తున్నావని శంకర్‌ను తిరుపతి అడిగాడు. ఈ క్రమంలో శంకర్ బండరాయి తట్టుకొని కిందపడిపోయాడు. అనంతరం ఆయన తిరుపతిని దూషించడమే కాకుండా బండరాయితో దాడి చేయడంతో తలకు గాయాలయ్యాయి. తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేయగా శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

చిగురుమామిడి,ఏప్రిల్ 15: మండలంలోని ఇందుర్తి గ్రామానికి చేందిన బుర్ర రవీందర్(50) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సందబోయిన శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రవీందర్ తనకు ఉన్న కొద్దిపాటి వ్యవసాయానికి అనేక అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాడు. చేసిన అప్పులు పెరిగి పోవడంతో ఇంట్లో తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఇటీవల కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించగా సాయంత్రం చికిత్స అందించే లోపే మృతి చెందాడు. మృతుడి కుమారుడు బుర్ర ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘాట్‌రోడ్డుపై అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

- ముగ్గురి గాయాలు

మల్యాల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి మంగళవారం ముగ్గురికి గాయాలయ్యాయి. రాయికల్ మండలం తాట్లవాయికి చెందిన వినోద్, అతడి భార్య శ్రీవాణి, కూతురు వేదాంశికతో పాటు మరొకరు కొండపై నుంచి ద్విచక్ర వాహనంపై ఘాట్‌రోడ్డు మీదుగా కిందకు వస్తున్నారు. బ్రేకులు పనిచేయక ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో వాహనంపై గల వినోద్, శ్రీవాణి, వేదాంశికకు గాయాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



తిరుపతి(ఫైల్)

జమ్మికుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దుర్గాకాలనీకి చెందిన పురంశెట్టి తిరుపతి (39) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. బయట పని ముగించుకుని వస్తుండగా రైల్వే ఓవర్‌బ్రిడ్జి మీద నుంచి వస్తూ ముందు ఉన్న డీసీఎం వ్యాన్‌ను ఓవర్‌టేక్ చేయబోయి అదుపు తప్పి కింద పడిపోయాడు. డీసీఎం వ్యాన్ వెనుక టైర్ తల మీద నుంచి అక్కడికక్కడే మృతి చెందాడు. చాలా సేపటి వరకు ఎవరూ మృతుడి ఆనవాళ్లు గుర్తించలేకపోయారు. పోలీస్‌లు మృతుడి వద్ద లభించిన ఆధారాలతో దుర్గా కాలనీకి చెందిన పూరంశెట్టి తిరుపతిగా గుర్తించారు. మృతుడికి భార్య సృజన, కుమార్తె, కుమారుడు ఉన్నారు. డీసీఎం వ్యాన్ స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

● అధిక లోడు వల్లే ప్రమాదం?

డీసీఎం వ్యానులో అధిక లోడు ఉండటంతో బ్రిడ్జి డౌన్‌లో సరిగా బ్రేకులు పడవని స్థానికులు చర్చించుకుంటున్నారు. పది టన్నులలోడు వెళ్లాల్సిన వాహనాల్లో 15నుంచి 20టన్నుల వరకు వెళ్తున్నాయని, పట్టించుకోవాల్సిన అధికారులు తనిఖీలతో సరిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అధిక లోడు వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీజ్ చేసిన మద్యం ధ్వంసం



సీజ్ చేసిన మద్యం బాటిళ్లు

గన్నేరువరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గత ఎన్నికల కోడ్ సమయంలో పోలీసులకు పట్టుబడిన 480 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ తాండ్ర నరేష్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సీఐ బాబా, ఎస్ఐ శ్రీకాంత్‌ల పర్యవేక్షణలో ధ్వంసం చేశారు. సీజ్ చేసిన మద్యం విలువ రూ.86 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు

- అనుమతి కన్నా ఎక్కువగా తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు
- ఎల్లమ్మ చెరువులో యథేచ్ఛగా అక్రమ దందా

రామడుగు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం షానగర్ గ్రామంలోని ఎల్లమ్మ చెరువులో మట్టి తరలింపు ఇష్టారాజ్యంగా సాగుతున్నా పట్టించుకునేవారు లేరు. అధికారులు అనుమతించినదానికంటే ఎక్కువగా తవ్వకాలు జరుపుతున్నా అడిగేవారు లేరు. ఇరిగేషన్ శాఖ అధికారులు ఒక వెయ్యి క్యూబిక్ మీటర్లు తరలింపునకు పెద్దపల్లి జిల్లాకు చెందిన ఓ వ్యక్తికి నాలుగు లారీలకు అనుమతించింది. అధికారుల ఉదాసీనతతో కాంట్రాక్టర్ పదుల సంఖ్యలో వాహనాల ద్వారా మట్టిని తరలించడమే కాకుండా విద్యుత్‌శాఖకు చెందిన ఒక ట్రాన్స్‌ఫార్మర్, మూడు విద్యుత్ స్తంభా లను విరగగొట్టి యథేచ్ఛగా మట్టి తరలించినట్లు తెలుస్తోంది. దీనిపై ఫిర్యాదు అందినప్పటికీ కాంట్రాక్టర్‌పై ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

రాత్రింబవళ్లు తవ్వకాలు

రోజుకు ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు మట్టిని రెండు ఎక్స్‌కావేటర్ల సహాయంతో నాలుగు లారీలతో మట్టిని తరలించాలని అధికారులు అనుమతులు ఇచ్చారు. వాటిని తుంగలో తొక్కి రాత్రింబవళ్లు తవ్వకాలు చేపట్టి వందలాది లారీల్లో మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వెయ్యి క్యూబిక్ మీటర్ల మట్టిని మాత్రమే ఆరు రోజులు తీయాల్సి ఉండగా ఇప్పటికే పెద్ద ఎత్తున మట్టి తరలించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రెండు ఎక్స్‌కావేటర్లు పదుల సంఖ్యలో లారీలు నిత్యం నడుస్తున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. పర్మిషన్ ఇచ్చింది గోరంత, తవ్వకాలు కొండంత అన్నట్లు కాంట్రాక్టర్ వ్యవహార శైలి ఉండడం అధికారుల చేతివాటాన్ని చూపిస్తున్నదని గ్రామస్థులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఈ విషయమై సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా గ్రామానికి చెందిన ముగ్గురు రైతులకు మట్టి తరలించడానికి పర్మిషన్ ఇచ్చామని తెలిపారు. రైతులకు ఇచ్చినట్లయితే చెరువులో పదుల సంఖ్యలో లారీలతో ఎందుకు మట్టి తరలిస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. దీనిపై ఇరిగేషన్‌శాఖ ఈఈ సుధాకిరణ్‌ను వివరణ కోరగా ప్రస్తుతం తవ్వకాలు ఆపాలని ఎక్కువ మొత్తంలో మట్టి తరలిస్తే ఎంక్వయిరీ చేసి సదరు కాంట్రాక్టర్ నుంచి ఫైన్ వసూలు చేస్తామని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని సంబంధిత కాంట్రా క్టర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకొని పర్మిషన్ లేకుండా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



ఎల్లమ్మ చెరువులో తవ్వకాలు



మట్టి తరలింపు కోసం ఉన్న లారీలు


తాటి ముంజలు కొస్తున్న గీత కార్మికులు

వారెవ్వా.. తాటిముంజలు

● వేసవి తాపాన్ని తీర్చే ఫలాలు

● పలు ఆరోగ్య ప్రయోజనాలు

మల్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నోరూరించే తాటి ముంజల సీజన్ వచ్చేసింది. ఏప్రిల్, మే నెలల్లో విరివిగా లభించే ఈ తాటి ముంజలను ప్రకృతి ప్రసాదంగా పేర్కొంటారు. వేసవి తాపాన్ని తీర్చడమే కాకుండా శరీర ఉష్ణోగ్రతలను సమతుల్యంగా ఉంచుతూ ఆరోగ్యానికి మేలు చేసే సుగుణాలు తాటి ముంజల ప్రత్యేకత. ఈ తాటిముంజలు కరీంనగర్-జగిత్యాల మార్గంలో గల కొండగట్టులో తాటి వనం అధికంగా ఉండడంతో ఎక్కువగా లభిస్తాయి. 100 రూపాయలకు 10 నుంచి 15వరకు తాటి ముంజలను విక్రయిస్తున్నారు.

పోషక విలువలు అధికం..: తాటి ముంజల్లో అనేక పోషక విలువలు ఉన్నాయి. వేసవిలో మాత్రమే లభించే ఈ తాటి ముంజలను మధుర ఫలంగానూ పేర్కొంటారు. ముంజల్లో 87 శాతం నీరు ఉంటుంది. అందులోని పోషక విలువలు వడదెబ్బ నివారణకు, శరీర ఉష్ణోగ్రతలను తగ్గించడానికి ఉపయోగపడతాయి. తాటి ముంజల లోపటి తెల్లని పదార్థం ఎండ తాపం నుంచి రక్షిస్తుంది. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న ఈ తాటి ముంజలు ప్రతి ఒక్కరూ రుచి చూడాల్సిందే.



తాటి ముంజలు చాలా ఇష్టం...



నీరజ, కరీంనగర్

తాటి ముంజలు అంటే నాకు చాలా ఇష్టం. వేసవి వచ్చిందంటే తప్పకుండా తింటాను. ప్రకృతి సహజ సిద్ధంగా లభిస్తున్న ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో చాలా పోషకాలు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ వేసవిలో తాటిముంజలను తీసుకుంటే మంచిది.

ఆరోగ్యానికి మేలు చేస్తాయి



పంజాల శివగౌడ్, గీత కార్మికుడు

తాటి ముంజలు ఎండ నుంచి రక్షిస్తాయి. అంతేగాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వేసవి సీజన్‌లో రెండు నెలల పాటు విక్రయిస్తాం. ప్రత్యేకంగా దూర ప్రాంతాల నుంచి అనేక మంది వచ్చి తీసుకువెళ్తుంటారు.

భారీగా జిల్లా న్యాయమూర్తుల బదిలీలు

రాజన్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పి. నీరజ

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 38మంది జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తుల బదిలీల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పి. నీరజను నియమిస్తూ మంగళవారం రాత్రి హైకోర్టు రిజిస్ట్రార్ ఆఫ్ విజిలెన్స్ ఉత్తర్వులు జారీచేశారు. సిరిసిల్ల జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా మూడేళ్లు విధులు నిర్వహించిన ఎన్. ప్రేమలతను గద్వాల జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేశారు. సిరిసిల్ల పోక్సో అండ్ 1వ అడిషనల్ సెషన్స్ జిల్లా కోర్టు జడ్జిగా పుష్పలతను నియమించారు. అదే విధంగా కరీంనగర్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎస్. శివకుమార్, పెద్దపల్లి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కె. సునిత, జగిత్యాల జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా రత్నపద్మావతిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. జగిత్యాలలో పనిచేసిన పి. నీలిమ మెదక్‌కు, కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన ప్రతిమను జనగామ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేశారు. కరీంనగర్ ఏసీబీ జిల్లా కోర్టు జడ్జిగా జె. విక్రమ్, కరీంనగర్ జిల్లా ఫ్యామిలీ కోర్టు అండ్ 4వ అడిషనల్ సెషన్స్ జిల్లా జడ్జిగా జె. కవితను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అగ్నివీర్ దరఖాస్తు గడువు 25 వరకు పొడిగింపు

జగిత్యాల అగ్రికల్చర్, పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్నివీర్ దరఖాస్తు గడువును ఈనెల 25 వరకు పొడిగించినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి బి.సత్తెమ్మ, పెద్దపల్లి ఉపాధి కల్పన అధికారి తిరుపతిరావు తెలిపారు. ఇండియన్ ఆర్మీలో వివిధ కేటగిరీల వారీగా అగ్నివీర్‌లో జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్‌కు 10వ తరగతి పాస్ మరియు అగ్నివీర్ ట్రేడ్స్ మెన్ (8వ తరగతి పాస్) ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు వారి అర్హత ఆధారంగా ఏవైనా రెండు కేటగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అదే విధంగా ఐటీఐ, డిప్లమా, ఎన్‌సీసీ అర్హత పొందిన అభ్యర్థులకు బోనస్ మార్కులుంటాయని పేర్కొన్నారు. 13 భాషల్లో కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఆన్‌లైన్ విధానంలో ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సికింద్రాబాద్‌లోని రిక్రూటింగ్ కార్యాలయం ఫోన్ నంబర్ 040-27740205లో సంప్రదించవచ్చన్నారు. ఔత్సాహిక అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీక్షా సమావేశం

భగత్‌నగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కరీంనగర్ జోన్ పరిధిలోని రీజినల్ మేనేజర్‌లు, డిప్యూటీ రీజినల్ మేనేజర్‌లు, అధికారులతో సంస్థ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రీజియన్లు, ఎలక్ట్రిక్ బస్సుల పని తీరుపైనా చర్చించారు. ఈ నెలలో అధిక పెళ్లి ముహూర్తాలు ఉన్నందున ప్రయాణికులకు సరిపడా బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. వేసవి దృష్ట్యా అన్ని బస్ స్టేషన్‌లలో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్‌లు, అకౌంట్స్ ఆఫీసర్లు, పర్సనల్ ఆఫీసర్లు, డిప్యూటీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వర్క్స్ మేనేజర్, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్లు పాల్గొన్నారు.

19న ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న కొత్తపల్లిలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ జట్టు, సౌత్ జోన్ సీనియర్స్ మహిళల, పురుషుల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు జనన ధ్రువీకరణపత్రం, ఒరిజినల్ ఆధార్‌కార్డుతో మధ్యాహ్నం 3 గంటలకు సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రభాకర్, పీఈటీ శ్రీధర్‌కు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9441925807, 8978995730 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతన అధ్యాయం

మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతన అధ్యాయం ప్రారంభించిందని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉగాదిని పురస్కరించుకొని సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. సన్నబియ్యం పంపిణీతో దళారి వ్యవస్థ కనుమరుగై పోయిందన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని భూ భారతి కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారన్నారు.

గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో భూ యాజమాన్య హక్కులు హరించబడ్డాయని ఆయన ఆరోపించారు. భూముల వివరాలు ఎవరైనా ఆన్‌లైన్‌లో చూసుకునేలా భూ భారతి చట్టం రూపొందించడం జరిగిందన్నారు. పారదర్శకతను పెంపొందించడానికి కాంగ్రెస్ సర్కారు ప్రయత్నం చేస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఆయన విమర్శించారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునః ప్రారంభించడంతో సమస్యలకు పరిష్కారానికి నూతన అధ్యాయం మొదలైనట్లయిందన్నారు. కాంగ్రెస్ సర్కారు ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏకగ్రీవ తీర్మానం చేశాయన్నారు. ప్రధాని నరేంద్రమోదీ బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి అమలు చేయాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

సీనియారిటీకి తగ్గట్టు గౌరవం లేక అసంతృప్తి

"కాంగ్రెస్‌లో నా స్థానం ఏమిటి..నా సీనియారిటీ ఏమిటి.. రాష్ట్రంలో కాంగ్రెస్‌లో మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హన్మంత్‌రావు (వీహెచ్) తర్వాత నేనే సీనియర్‌ను.. జానారెడ్డి కూడా నా తదుపరి నాలుగు సంవత్సరాలకు కాంగ్రెస్ సభ్యత్వం తీసుకున్నారు..నా సీనియారిటీకి తగ్గట్టుగా గౌరవాన్ని పొందలేని పరిస్థితుల్లో అసంతృప్తితో ఉన్నా" అని జీవన్‌రెడ్డి అన్నారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఎలాంటి పోరాటం చేశారో, శాసనసభా పక్ష నాయకుడిగా భట్టి విక్రమార్క ఎలాంటి పోరాటం చేశారో, శాసన మండలి నాయకుడిగా అదే స్థాయిలో తాను పోరాటం చేశానని జీవన్‌రెడ్డి తెలిపారు. శాసనమండలిలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ఒంటరి పోరాటం చేశానన్నారు.

నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్నానన్నారు. జగిత్యాలలో కాంగ్రెస్ అంటేనే జీవన్‌రెడ్డి... జీవన్‌రెడ్డి అంటేనే కాంగ్రెస్ అన్న విధంగా పనిచేశానని ఆయన గుర్తు చేశారు. ఏదైనా అంశాల పట్ల భిన్నాభిప్రాయాలు కలిగి ఉండవచ్చని, అంతమాత్రాన పార్టీ వీడుతారని అనడం సబబు కాదన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు ప్రేమ్‌సాగర్‌రావు, రాజ్‌గోపాల్‌రెడ్డిలు వారికి ఉన్న పరిస్థితుల్లో పదవులు ఆశించడం తప్పుగా భావించొద్దని జీవన్‌రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, కాంగ్రెస్ నాయకులు కొత్త మోహన్, గాజుల రాజేందర్, చాంద్‌పాషా, పిప్పరి అనిత, మహిపాల్, రఘు, రమేశ్, శీలం నరేశ్, గుండ మధు తదితరులు పాల్గొన్నారు.

కష్టాలను కడతేర్చు బద్దిపోచమ్మ తల్లీ..

బోనం మొక్కులు చెల్లించుకున్న భక్తులు


బద్దిపోచమ్మ దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు



వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కష్టాలను కడతేర్చి.. మమ్మల్ని చల్లగా చూడు బద్దిపోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారికి భక్తులు తెల్ల వారు జామునే మట్టి పాత్రలో నైవేద్యాన్ని వండుకొని డప్పుచప్పుళ్ల మధ్య నెత్తిన బోనాలతో శివసత్తుల నృత్యాలతో బైండ్ల వాళ్ల ఆటలతో ఊరేగింపుగా ఆలయానికి తరలి వచ్చారు. సుమారు రెండు గంటల పాటు క్యూలైన్‌లో నిరీక్షించిన భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని బైండ్ల పూజారులతో పట్నాలను వేశారు. అనంతరం నూతవస్త్రాలను పెటి అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆల య ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఏఈవో లు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, అశోక్‌కుమార్‌లు, సూపరింటెండెంట్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నీరుకుళ్ల రంగనాయక స్వామి ఆలయంలో వైభవంగా శకటోత్సవం

రేపు రథోత్సవం


శకటోత్సవంలో పాల్గొన్న భక్తులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల రంగనాయకుల స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి వాహన సేవలకు సంబంధించిన శకటోత్సవం జరిగింది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా వివిధ వాహనాలలో స్వామి వారిని ఊరేగించారు. ఆలయానికి సంబంధించిన వాహనాలతో పాటు నీరుకుళ్ల, వేగురుపల్లి గ్రామస్థులు ప్రత్యేకంగా తయారు చేసుకుని వచ్చిన ఏనుగు వాహనం పై స్వామి వారిని ఊరేగించారు. అనంతరం ఆలయం ఆవరణలో డోపు కథ వివరించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధనగిరి మనోహరాచార్యులు, రాజ్‌కుమారాచార్యులు డోపు కథను వివరించారు.

● **డోపు కథ విశిష్టత:** తిరుమంగళయ్యార్ అనే భాగవతోత్తముడు నిత్య అన్నదాన కైంకర్యం చేస్తుంటాడు. నిత్యం చేయడం వలన అతని వద్ద ఉన్న ద్రవ్యం ఖాళీ అవుతుంది. తిరుమంగళయ్యార్ దారి దోపిడీ చేసి అన్నదానం కొనసాగిస్తాడు. ఒక రోజు దారి దోపిడీ చేస్తున్న సందర్భంలో శ్రీరంగ నాథుడే సపరివార సమేతంగా పెళ్లి వారి వేషధారణలో వస్తుండగా ఆ బృందాన్ని దోపిడి చేస్తాడు. స్వామి కాలివేలికి ఉన్న బంగారు ఉంగరాన్ని ఇవ్వమని అడుగుతాడు. అన్ని ఆభరణాలు నువ్వే లాక్కున్నావు, దాన్ని కూడా లాక్కో అంటారు స్వామి.

ఎంతకూ ఆ ఉంగరం రాదు. ఏమైనా మంత్రం వేశావా.. నాకు కూడా చెప్పవా అంటూ స్వామి వారిని తిరుమంగళయ్యార్ అడుగుతారు. అపుడు స్వామి అతడి చెవిలో నారాయణ అష్టాక్షరీ మంత్రం ఉపదేశించి కళ్లు తెరువు అంటారు. తిరుమంగళయ్యార్‌కు రంగనాథ స్వామి దివ్యమైన మంగళ స్వరూపాన్ని చూపిస్తాడు. ప్రతీ వైష్ణవాలయంలో రథోత్సవం కన్నా ముందు రోజు డోపు కథ వివరిస్తారు. కథ విన్న వారికి అష్ట ఐశ్వర్యాలు సిద్దిస్తాయని నమ్మకం.

కొండగట్టులో భక్తుల రద్దీ


ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. సోమవారం వేములవాడ రాజన్నను దర్శించుకున్న భక్తులు ఆ రాత్రి కే కొండపైకి చేరుకొని అంజన్న దీక్షపరులు వేకువజామునే స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

నిలిపి ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన కారు

వేములవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నిలిపి ఉన్న వాహనాన్ని అటవీశాఖ అధికారుల కారు ఢీకొట్టిన సంఘటన మంగళవారం వేములవాడలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వేములవాడ పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు అల్లాడి రమేష్ స్థానిక వాసుదేవా టవర్స్‌లోని స్టేట్ బ్యాంక్‌కు పని నిమిత్తం వెళ్లి తన ఇన్నోవా వాహనాన్ని బ్యాంకు ఎదుట పార్కు చేసి లోపలికి వెళ్లారు. అదే సమయంలో అటవీ శాఖ అధికారులు ప్రయాణిస్తున్న కారు వేగంగా వచ్చి పార్కు చేసి ఉన్న ఇన్నోవా వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో కారు నడిపిస్తున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌తో పాటు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గాయపడంతో వారిని 108 వాహనంలో వేములవాడ ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ధాన్యం ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రమాదం

మానకొండూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో మంగళవారం ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. వరి ధాన్యం రైసుమిల్లులో విక్రయించేందుకు రైతు ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్నాడు. అన్నారంలోని లోలెవల్ బ్రిడ్జి వద్ద రోడ్డు గుంతలమయంగా మారడంతో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరుగలేదు.

లోలెవ్ బ్రిడ్జి వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టక పోవడంతో పలుమార్లు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కళాకారులకు దేవాలయాల్లో ఉద్యోగాలు ఇవ్వాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దుబ్బుల కొలుపు కళాకారులకు దేవాలయాల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జునుగరి దుర్గయ్య కోరారు. మంగళవారం నగరంలో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. దుబ్బుల కొలుపు కళాకారులను సాంస్కృతిక శాఖలో గుర్తింపు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంలో అవ కాశం కల్పించాలని కోరారు. వృద్ధ కళాకారులకు పింఛన్ ఇవ్వాలని, ఇళ్లు లేని వారికి పక్కా ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఉచిత హెల్త్‌కార్డులు ఇవ్వాలని అన్నారు. ప్రతీ కొలుపు కళాకారుడికి వ్యక్తి గత పూచీకత్తుపై లక్ష రూపాయల రుణం ఇవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు జునగరి లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిరి శ్రీకాంత్, గౌరవ సలహాదారుడు లెల్లెల బాలకృష్ణ పాల్గొన్నారు.

ధర్మపురి బోయవాడలో చోరీ

బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరణ

ధర్మపురి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని బోయవాడలో చోరీ జరిగింది. బోయవాడకు చెందిన గడప రమేష్ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి రూ.80 వేల నగదు, 7 తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు అపహరించుకవెళ్లారు, వచ్చిన వ్యక్తులు ఇంటిలో ఒక పెట్టెలో దాచి ఉన్న నగదు, బంగారు, వెండి ఆభరణాలు అపహరించారు. పెట్టె తెరచి ఉండటంతో దొంగతనం జరిగినట్లు రమేష్ మంగళవారం గుర్తించాడు. వచ్చిన వ్యక్తులు రమేష్ ఇంటిని నాశనం చేస్తామని అక్కడే ఒక లేఖను వదిలి వెళ్లి పరారయ్యారు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కాగా చోరీ ఎప్పుడు జరిగిందో తెలియ రావడం లేదు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,600 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు ఐదుగురు రైతులు 75క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు ఆరు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,600, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంచం పట్టిన విద్యార్థులు

● 30 మందికి జ్వరం ● కోరుట్ల ఆసుపత్రిలో 14 మందికి చికిత్స

కోరుట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 30 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారు. మంగళవారం ఉదయం జ్వరంతో బాధపడుతున్న 14 మంది విద్యార్థులను కోరుట్ల పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌కు వైద్య పరీక్షలకు తీసుకువచ్చారు. వారిలో ఒక విద్యార్థి తీవ్ర జ్వరంతో బాధపడగా వైద్య సిబ్బంది అప్రమత్తమై విద్యార్థులను కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని విద్యార్థుల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం గురుకుల పాఠశాలలో ఆయన ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. 30 మంది విద్యార్థులకు జ్వరం ఉన్నట్లు గుర్తించి వారికి వైద్యం అందించారు. విద్యార్థుల రక్త నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం టీ హబ్‌లోని ల్యాబ్‌కు తరలించారు.


జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులకు మందులను అందజేసిన వైద్య సిబ్బంది

కాగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులతో పాటు పాఠశాలలో జ్వరంలో బాధపడుతున్న వారిని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావులు వేర్వేరుగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పులతో విద్యార్థులకు జ్వరం వచ్చినట్లు తెలిపారు. విద్యార్థులకు జ్వరం తగ్గడంతో సాయంత్రం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. గురుకులంలో వైద్య శిబిరం కొనసాగిస్తున్నారు. విద్యార్థులు జ్వరంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న పలువురు తల్లిదండ్రులు వారిని ఇంటికి తీసుకెళ్లారు.


కోరుట్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు

(5వ పేజీ తరువాయి)

సహకార సంఘాల ఆధ్వర్యంలో 239 కేంద్రాలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో 59, ఇతరత్రా 4 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడక్కడ ప్రజాప్రతినిధులు కొనుగోలు కేంద్రాలను ఆరంభించారు. కానీ కొనుగోళ్లు చేపట్టడం లేదని రైతులు చెబుతున్నారు. జిల్లాలోని మంథని, ముత్తారం, కమాన్‌పూర్, సుల్తానా బాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ధర్మారం, పాలకుర్తి, అంతర్గాం మండలాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. పాలకుర్తి మండలం బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టు స్థలంలో పాలకుర్తి, కుర్మపల్లి, బసంత్ నగర్, కొత్తపల్లి, తక్కళ్లపల్లి గ్రామాలకు చెందిన పలు వురు రైతులు ధాన్యం కుప్పలు పోసి పది రోజులు కావస్తున్నది. రోజు ఉదయం వేళ ఆరబోసి నేర్పి సాయంత్రం వేళలో కుప్ప చేస్తున్నారు. వాతావరణంలో మార్పులు వస్తున్నాయని, ఒక రోజు ఎండ కొడుతూ, మరో రోజు మబ్బులు పడుతున్నదని, ఎప్పుడు అకాల వర్షాలు, రాళ్ల వర్షాలు కురిసేది తెలియదని రైతులు అంటున్నారు. ప్రతి యాసంగి సీజన్‌లో అకాల వర్షాలు, వడగళ్ల వర్షాలు కురిసి పంట నష్టపోవాల్సి వస్తున్నదని రైతులు తెలిపారు. ఆరుగాలం శ్రమించి చెమటోడ్చి పండించిన ధాన్యం వర్షార్పణం కాకుండా చూడాలని రైతులు వేడుకుంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి సత్వరమే ధాన్యం కొనుగోళ్లను ఆరంభించాలని రైతులు కోరుతున్నారు.

అక్రమంగా మోటార్లు బిగిస్తే జరిమానాలు

మంథని, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంచినీటి సరఫరా చేసే నల్లాలకు అక్రమంగా మోటార్లు బిగిస్తే సీజ్ చేయడంతోపాటు జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ మనోహర్ మంగళవారం తెలిపారు. నల్లాలకు మోటార్లు బిగించడం వలన మంచినీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని తొలగించడానికి మున్సిపాలిటీ వార్డు ఆఫీసర్లు, సిబ్బంది రోజు వార్డుల్లో నల్లాలను పరిశీలిస్తారన్నారు. ప్రజలు బిగించిన మోటార్లను తొలగించి సహకరించాలని కోరారు.

అభివృద్ధిని పట్టించుకోని ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్టమధు

రామగిరి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మంథని ప్రాంత అభివృద్ధి ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే పుట్టమధు అన్నారు. మంగళవారం మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి రోడ్డు పనులను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయలతో ప్రారంభించిన రోడ్డు విస్తరణ పనులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 16 నెలలు గడుస్తున్నా పూర్తి కాకపోవడంపై ఎమ్మెల్యే సిగ్గుపడాలన్నారు. ఆర్‌అండ్‌బీ ఈఈకి, కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడగా బిల్లులు రావడం లేదని చెబుతున్నారన్నారు. ఓడెడ్ బ్రిడ్జి నిర్మాణంపై మాట్లాడడం లేదని పేర్కొన్నారు. నాణ్యతతో నిర్మాణం జరగలేదని చెబుతున్న ఎమ్మెల్యే సదరు కాంట్రాక్టర్‌ను జైలుకు పంపాలని లేదా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు శంకేషిరవీందర్, పూదరి సత్యనారాయణగౌడ్, మ్యాదరవేని కుమార్, భాస్కర్, కొమ్ము నాగన్న, దేవశ్రీనివాస్, పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతుంది



కెడెట్లతో మాట్లాడుతున్న ఎన్‌సీసీ అధికారి జయంత్

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌ను తెలంగాణ 9వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జయంత్ మంగళవారం సందర్శించారు. ఎన్‌సీసీ కెడెట్లతో మాట్లాడారు. ఎన్‌సీసీ ద్వారా ఎన్నో అవకాశాలు వస్తాయని, అలాగే క్రమశిక్షణ అలవడుతుందన్నారు. రిపబ్లిక్ డే క్యాంప్‌లో పాల్గొన్న కెడెట్లను అభినందించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ ఆరోగ్యమేరి, టికిలా కమాండింగ్ ఆఫీసర్ జయంత్‌ను సన్మానించారు. ఎన్‌సీసీ మొదటి అధికారి జ్యోత్స్న, బెటాలియన్ సుబేదార్ మేజర్ సాగర్‌సింగ్, సూర్య ప్రసాద్, అన్మాల్‌సింగ్, ఎన్‌సీసీ కెడెట్లు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కోరుకంటి చందర్

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న జరగనున్న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు ప్రజలు తరలిరావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. మంగళవారం టీబీజీకేఎస్ ఆఫీస్‌లో రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమంలో సబ్బండ వర్గాలను ఏకతాటిపై తేవడానికి కేసీఆర్ టీఆర్‌ఎస్‌ను స్థాపించి రాష్ట్రాన్ని సాధించే వరకు వెనకడుగు వేయలేదన్నారు. వరంగల్ సభకు పార్టీ కార్యకర్తలు, అనుబంధ సంఘాల కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని చందర్ పిలుపునిచ్చారు. పట్టణ అధ్యక్షుడు మేడి సదానందం, మాజీ కార్పొరేటర్ బాదె అంజలీదేవి, నాయకులు దాసరి బాలరాజు, పొయిల సంపత్, మోహన్, ఓదేలు, కుమార్‌నాయక్, సతీష్, సంధ్యారెడ్డి, పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు ఆటో డ్రైవర్ల విరాళం

గోదావరిఖని, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు గోదావరిఖనికి చెందిన ఆటో యూనియన్ నాయకులు రూ.50వేల విరాళాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు అందజేశారు. చందర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో ఆటో డ్రైవర్లను కంటికి రెప్పలా కాపాడుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆటోవాలాల పరిస్థితి ఆగమైందన్నారు. రజతోత్సవ సభకు రామగుండం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాని పిలుపునిచ్చారు. నాయకులు నీలారపు రవి, సురేష్, సదానందం, విజయ్ కుమార్, సురేష్, రాజేందర్, అనీల్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సభకు భారీగా తరలిరావాలి

సుల్తానాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు మండలం నుంచి 1500 మందిని తరలిస్తున్నట్లు మాజీ ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, గర్రెపల్లి సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్ రావు, సూరశ్యామ్ తెలిపారు. సుల్తానాబాద్‌లో వారు మంగళవారం మాట్లాడుతు వరంగల్‌లో ఈ నెల 27 జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని, మండలం నుంచి ముప్పై వాహనాలలో వరంగల్ తరలివెళ్లనున్నట్టు వారు వివరించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేస్తున్నారన్నారు. ఎన్నికలు ఎపుడు జరిగినా ఏర్పడేదీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని అన్నారు.

21 వరకు ఇందిరమ్మ కమిటీల నుంచి లబ్ధిదారుల జాబితా సేకరించాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఈ నెల 21వ తేదీ వరకు ఇందిరమ్మ కమిటీల నుంచి లబ్ధిదారుల జాబితాలు సేకరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి పొరపాట్లు లేకుండా చూడాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రభుత్వం మంజూరు చేసిన 3,500 ఇళ్లలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాలలో కొన్ని ఇళ్లు మంజూరు చేశామని, మిగిలిన ఇళ్లను గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారీగా మంజూరు చేయాలన్నారు.

ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు అర్హత ఉండి ఇంటి స్థలం ఉన్న దరఖాస్తుల సంఖ్య ప్రాతిపదికగా ఇళ్ల కేటాయింపు పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ కమిటీలతో సమావేశం నిర్వహించి, అర్హుల జాబితాలో నుంచి మొదటి విడత మంజూరు చేసేందుకు లబ్ధిదారుల ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ కమిటీల నుంచి సమాచారం రాకపోతే ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ఎంపీడీఓలకు సూచించారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన ప్రతీ 200 ఇళ్ల లబ్ధిదారులకు ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, కార్యదర్శి బృందంగా ఏర్పడి ఈనెల 30 వరకు మరోసారి ఫీల్డ్ వెరిఫికేషన్ చేయాలని, ఎవరైనా అనర్హులు ఉంటే జాబితా నుంచి తొలగించాలన్నారు. మే 1న ప్రతి గ్రామంలో అర్హుల జాబితా అతికిస్తామని, జిల్లా ఇంచార్జి మంత్రి తుది ఆమోదంతో మే 5 లోపు ఇందిరమ్మ మంజూరు పత్రాలు పంపిణీ చేయాలన్నారు. ఆర్‌డీఓలు బి.గంగయ్య, సురేష్, డీఆర్‌డీఓ ఎం కాళిందిని, డీపీఓ వీర బుచ్చయ్య, జడ్పీ సీఈఓ నరేందర్, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా కుమారస్వామి

మంథని, ఏప్రిల్ 15: మంథని తహసీల్దార్‌గా కుమారస్వామి మంగళవారం బదిలీ అయ్యారు. కొద్ది నెలలుగా తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జి తహసీల్దార్‌తో కొనసాగిస్తున్నారు. రామగుండం తహసీల్దార్‌గా పని చేస్తున్న కుమారస్వామి బదిలీపై ఇక్కడకు రానున్నారు.

అనుమతి లేకుండా ధర్నాలు చేయరాదు

మంథని, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ధర్నా, రాస్తారోకోలు చేయరాదని ఎస్‌ఐ రమేష్ మంగళవారం తెలిపారు. మత విద్వేషాలు సృష్టించే వారి పై, ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. డీజేలకు, డ్రోన్ కెమెరాలకు అనుమతులు లేవన్నారు. నిరసనలు, దిష్టిబొమ్మల దహనం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదకద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి.వేణు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మాదక ద్రవ్యాల, నియంత్రణ చర్యలపై అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డిపిఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణకు శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఆలోచనా శక్తి నశిస్తాయన్నారు. భావితరాలు మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా సమాజంలో మంచి, చెడు తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్య అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అం దించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. గోదావరిఖని ఆసుపత్రిలో 10 పడకల డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేశామని, అవసరమైన వారికి చికిత్స అందించాలని సూచించారు. అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని అదనపు కలెక్టర్ డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ను సూచించారు. ఏసిపిలు జి.క్రిష్ణ, రమేష్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాష్, అధికారులు పాల్గొన్నారు.

అయోధ్య కర సేవకులకు సన్మానం



కర సేవకులను సన్మానిస్తున్న కందుల సంధ్యారాణి, నాయకులు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రాముని ఆలయ నిర్మాణం చేయాలని 35 సంవత్సరాల క్రితం గోదావరిఖని నుంచి వెళ్ళి కర సేవలో పాల్గొన్న సంఘ పరివార్ క్షేత్ర కార్యకర్తలను మంగళవారం బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేరుగు హన్మంతుగౌడ్‌లు ఘనంగా సన్మానించారు. రేణుక ఎల్లమ్మ ఆలయంలో కోడూరి రమేష్ అధ్యక్షతన కర సేవకులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి మూడు బృందాలు అయోధ్యకు చేరుకున్నాయని, కాల్పులను సైతం లెక్క చేయకుండా కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. కర సేవకులు ఇస్సంపల్లి వెంకన్న, గిరిధర్‌లాల్ రాఠి, వెంకటేశ్వర్లు, తిరుపతి, గోగుల రవీందర్‌రెడ్డి, మడికొండ శ్రీనివాస్, కుంభాల రాజు, చంద్రమౌళి, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, రాధక్క, మురళి, సత్యనారాయణలను సన్మానించారు. నాయకులు మస్కుల భాస్కర్‌రెడ్డి, కోమళ్ల మహేష్, అపర్ణ, రాకేష్, రాజ్ కుమార్, ఉష, శ్రీనివాస్, ఆకాష్, అరుంధతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్‌ల పరిశీలన



రోడ్డు పరిశీలిస్తున్న ఎస్ఐ చంద్రకుమార్

రామగిరి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి మండలంలోని కల్వచర్ల- రామయ్యపల్లి వరకు గల రోడ్డుపై ప్రమాదాలు జరిగే ప్రదేశాలను మంగళవారం ఎస్ఐ చంద్రకుమార్, ఆర్‌అండ్‌బి ఏఈఈ సాయితేజలు పరిశీలించారు. ప్రమాదాలకు గల ఇంజనీరింగ్ లోపాలను గుర్తించి భద్రత చర్యలపై పరిశీలన చేపట్టారు. ఎస్ఐ చంద్రకుమార్ మాట్లాడుతూ వాహనచోదకులు ట్రాఫిక్ నియమాలను పాటించాలని, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని సూచించారు.

పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ

రామగిరి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయుసీ ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొటరవీందర్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకొని మంగళవారం కల్వచర్ల గ్రామానికి చెందిన పలు పేద కుటుంబాలకు నెల రోజులకు సరిపడే నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. మాజీ జెడ్‌పీటీసీ గంటవెంకటరమణరెడ్డి, మేకల మారుతీ, బెల్లంశ్రీనివాస్, అనవేన శ్రీనివాస్, శంకర్, నికిల్‌రెడ్డి తదితరుల పాల్గొన్నారు.

నేటి తరానికి స్ఫూర్తి కాంతారావు

ఎలిగేడు,ఏప్రిల్ 15. (ఆంధ్రజ్యోతి): నేటి తరానికి కాంతారావు స్ఫూర్తిగా ఉంటారని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సుల్తాన్‌పూర్‌లో స్వాతంత్ర సమరయోధుడు, మాజీ సర్పంచ్ దివంగత తానిపర్తి కాంతారావు సంతాప సభను మంగళవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దాసరిమనోహర్‌రెడ్డి హాజరై నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌గా 30ఏండ్ల పాటు పనిచేసి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశాడన్నారు. నాయకులు బాలాజిరావు, తానిపర్తి మోహన్‌రావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

మంథని, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ డిపోలో అగ్ని ప్రమాదాల నివారణపై మంథని ఫైర్ ఆఫీసర్ శివశంకర వరప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికులకు అగ్ని ప్రమాదాల నివారణ పై కరపత్రాలను పంపిణీ చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేటప్పుడు ఎవరికైనా గుండెపోటు సంభవిస్తే సీపీఆర్ చేసి ఎలా రక్షించాల్లో ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఫైర్ సిబ్బంది మేడ దేవేందర్, నరేందర్, రఘు, రమేష్, నాగరాజులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని ఫైర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ప్రజలకు అవగాహన కల్పిం చారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం గోదావరిఖని బస్టాండ్, చౌరస్తాలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుందని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అగ్ని మాపక సిబ్బంది పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్, సిబ్బంది

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



పొట్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అయోధ్యసింగ్

అంతర్గాం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అయోధ్యసింగ్ కోరారు. మంగళవారం పొట్యాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రామగుండం మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ మడ్డి తిరుపతిగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధాన్యం డబ్బులను రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నాలుగు రోజుల్లోగా జమ చేసేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. మాజీ సర్పంచ్ ఏదులపురం నీరజ వెంకటేష్, బీసి సెల్ మండల అధ్యక్షుడు బరుపటి శ్రీనివాస్, సంతోష్, నాగరాజు, కొత్తపల్లి రాజు, రమేష్, అశోక్, శ్రీను, శ్యామ్, నర్సయ్య, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ మహోత్సవానికి తరలిరండి



మాట్లాడుతున్న మేరుగు హన్మంతుగౌడ్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఎల్లమ్మ ఆలయంలో జమదగ్ని రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం, బోనాలకు ప్రజలు తరలిరావాలని ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు హన్మంతు గౌడ్ కోరారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 24వరకు మహోత్సవాలు జరుగుతాయన్నారు. ఆదివారం పోచమ్మ బోనాలు, సోమవారం పట్నాలు, మంగళవారం కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. నాయకులు వంగ శ్రీనివాస్, బాలసాని స్వామిగౌడ్, పొన్నం విజయ్‌కుమార్, పొన్నం అంజయ్య, పాల్గొన్నారు.

నేటి నుంచే ఒడిశా నైనీ బొగ్గు బ్లాక్‌లో ఉత్పత్తి



నైనీ బొగ్గు బ్లాక్‌ను సందర్శిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క(ఫైల్)

గోదావరిఖని, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తొమ్మిదేళ్ల సింగరేణి నిరీక్షణకు నేటితో తెరపడనున్నది. సింగరేణి చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు తవ్వకాన్ని ప్రారంభించనున్నది. ఒడిశాలోని అంగూల్ జిల్లాలో సింగరేణికి కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్‌ను బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్ బలరాం తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రం వరకే పరిమితమై బొగ్గు గనులు నిర్వహిస్తున్న సింగరేణి ఇప్పుడు నైనీ బొగ్గు బ్లాక్ ద్వారా ఇతర రాష్ట్రాల్లోకి అడుగు పెట్టడాన్ని ఒక చరిత్రాత్మక ఘట్టంగా పేర్కొన్నారు.

తొమ్మిదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ...

2016 మే నెలలో ఈ బొగ్గు బ్లాక్‌ను కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ సింగరేణికి కేటాయించినప్పటికీ, అన్ని రకాల అనుమతులు సాధించి, గనిలో తవ్వకం ప్రారంభించడానికి తొమ్మిదేళ్ళ కాలం నిరీక్షించాల్సి వచ్చింది. చివరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ చూపుతూ అప్పటి కేంద్ర బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని, ప్రస్తుత బొగ్గు శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఒడిశా రాష్ట్రంలో పర్యటించి ఒడిశా ముఖ్యమంత్రి, అధికారులతో సంప్రదింపులు జరిపి గని ప్రారంభానికి మార్గం సుగమం చేశారు. దీంతో చివరికి సింగరేణీయుల చిరకాల స్వప్నం సాకారమైంది.

నైనీ బొగ్గు బ్లాక్ విశేషాలు...

నైని బొగ్గుబ్లాక్ నుంచి 340.78మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంది. ఈ గని పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకుంటే ఏడాదికి 10మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగనున్నది. సింగరేణిలో ప్రస్తుతం ఉన్న 17ఓపెన్ కాస్ట్ గనుల కన్నా ఇదే అతి పెద్ద గని కానున్నది. ఏడాదికి కోటి టన్నుల చొప్పున 38 సంవత్సరాల పాటు ఈ గని నుంచి బొగ్గు ఉత్పత్తి చేయనున్నారు. తెలంగాణలో ప్రస్తుతం సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో ఒక టన్ను బొగ్గు ఉత్పత్తికి సగటున 12 టన్నుల ఓబీ తొలగిస్తుండగా ఈ గనిలో ఒక టన్ను బొగ్గుకు కేవలం రెండున్నర క్యూబిక్ మీటర్ల ఓబీ తీస్తే సరిపోతుంది. దీంతో ఈ గని సింగరేణికి లాభదాయమని భావిస్తున్నారు. గనిలో మేలైన జీ-10 రకం నాణ్యమైన బొగ్గు లభిస్తోంది. గనిలో ఓబీ తొలగించడానికి, బొగ్గు తవ్వకానికి, బొగ్గు రవాణాకు సంబంధించి ఇప్పటికే కాంట్రాక్ట్‌లను అప్పగించారు. అయితే ఈ ప్రాంతంలో గల ఇతర బొగ్గు కంపెనీలతో కలిసి 60కిలోమీటర్ల రైలు మార్గాన్ని నిర్మించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. నైనీ బొగ్గు బ్లాకు కోసం మొత్తం 2255 ఎకరాల భూమి సేకరించారు.



బయో కెమిస్ట్రీ ఫలితాల్లో తిరుపతిరెడ్డికి ఫస్ట్ ర్యాంక్



తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, ఏప్రిల్ 15(ఆంధ్ర జ్యోతి): సింగరేణి ఇటీవల నిర్వహించిన ఇంటర్నల్ బయో కెమిస్ట్రి పరీక్షల్లో ఆర్‌జీ-2 పరిధిలోని ఓసీపీ-3 సీహెచ్‌పీలో పని చేసే నల్లా తిరుపతిరెడ్డి మొదటి ర్యాంకు సాధించారు. బదిలీ వర్కర్‌గా సింగరేణిలో చేరిన తిరుపతిరెడ్డి సింగరేణి నిర్వహించిన ఇంటర్నల్ పరీక్షలకు హాజరవుతూ బయో కెమిస్ట్రిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. ర్యాంకు సాధించిన తిరుపతిరెడ్డిని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మంగళవారం సన్మానించారు. టీబీజీకేఎస్ జాయింట్ సెక్రటరీ చెల్పూరి సతీష్, సబాస్టియన్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా సర్వే అధికారిగా పని చేస్తూ మందమర్రి ఏరియాకు బదిలీపై వెళ్తున్న బూక్యా దేశాయిని మంగళవారం ఆర్జీ-2 యాజమాన్యం సన్మానించింది. ఓసీపీ-3 పీఓ ఉదయ్‌హరిజన్, అధికారులు ఎర్రన్న, సంతోష్‌కుమార్, అనిల్‌కుమార్, మురళీకృష్ణ, ఉజ్వల్ ఉపాధ్యాయ, సృజన్‌మెహ్రా పాల్గొన్నారు.